
# మెరుపులో మరకలు!

• రచన : శ్రీ పేరిచర్ల రామకృష్ణ •



(రచయిత)

చీకటి కాటుకలా అలుముకుంది.

బూజు పట్టిన ఒక లైటు లోపల మంద్రంగా వెలుగుతుంది.

గాయత్రి అసహనంగా గడియారం వంకచూసింది

పదకొండు దాటి పది కావొస్తుంది.

క్రింది పెదవిని పంటిలో కొరికింది. కనుకొలకుల్లోంచి నీళ్ళు ఉబికి రావటానికి సిద్ధంగా ఉన్నాయి.

సరిగ్గా అప్పుడే తలుపు శబ్దమయ్యింది.

వెంటనే తలుపులు తీయాలనిపించలేదు.

తలుపులు విరిగిపోయేటంగా శబ్దం వస్తోంది.

అయినా గాయత్రి కదలలేదు. కన్నీళ్ళు మాత్రం ఉబికి వచ్చాయి.

''గాయత్రీ''

బయటనుంచి శబ్దం గట్టిగా వినిపించింది అరుపులు... నెమ్మదిగా వెళ్ళి తలువు తీసింది.

ఊహించినట్లుగానే ఎమరుగా తన భర్త రామరాజు.

'ఇంత అర్ధరాత్రివరకూ ఎక్కడ తిరిగి వస్తున్నారు. తాగుడు ఇక మానరా......మీ కోసం ఎదురుచూసే భార్య ఇంట్లో ఉందన్న జ్ఞాపకం కలగలేదా? ఇలాంటి సూటిప్రశ్న లేపి గాయత్రి నోటివెంట రాలేదు ఎందుకంటే ఆ స్థాయి రామరాజు ఎప్పుడో దాటిపోయాడు.

'అంతలా తలుపులు బాదుతుంటే వినిపించలేదా!' కోపంగా అన్నాడు.

'వినిపించింది ... కావాలనే తలుపు తీయలేదు' నిర్లక్ష్యంగా బదులిచ్చింది గాయత్రి.

'అంటే నువ్వు తలుపులు తీసేవరకూ కుక్కలా గుమ్మం వద్ద పడుండాలన్నమాట.

'నేను మాత్రం అర్ధ రాత్రివరకూ మీ కోసం మేల్కొని వుండటంలేదా.'

భార్య వెంటనే తిరిగి జవాబు చెప్పేటప్పటికి చేసేది లేక రామరాజు మౌనం వహించాడు.

ఎక్కడో దూరంగా చీకటి చెట్టుమీద గుడ్లగూబ వికృతంగా అరిచింది.

'ఇంటికి రావటానికి కూడా వేళా పాళా వుండాలి' భోజనం వడ్డిస్తూ అంది గాయత్రి.

'నేను హోటల్లో భోంచేసి వచ్చాను' హేంగర్‌కి ఫాంటు తగిలించి లుంగీతో కూర్చుకుంటూ అన్నాడు.

'ఏమిటి మీ ఉద్దేశ్యం! వండినదంతా ఏంచేయమంటారు. రేపటికి పనికిరాదు.

'పనికిరాకపోతే గంగలో పడెయ్! ప్రతిదానికీ వెధవ సాధింపు నువ్వూను.'

దానితోపాటు నన్ను గంగలో కలపండి. పీడ వదిలిపోతుంది' భోరుని ఏడ్చేసింది గాయత్రి.

'నీ ఏడుపు చూడలేక చస్తున్నాను ముందు లైటార్పు'

అప్పటికే రామరాజు పాలకడలిపై నాగతల్పంమీద విష్ణుమూర్తిలా మూలనున్న మంచంమీద పవళించాడు.

గాయత్రి అలవాటుగా లైటార్పి చాప మరోమూల వేసుకుంది.

'ఏయ్! గాయత్రీ అక్కడెందుకు ఇట్రా...'

గాయత్రి మాట్లాడలేదు.

చీకటి చిక్కగా వుంది.

'రమ్మంటుంటే...'

'అంత ప్రేమ పుట్టుకొచ్చింది. ఈ రోజు ఎవరూ దొరకలేదా!'

రామరాజు ఏమీ మాట్లాడలేదు. కానీ చీకటిలోంచి మాత్రం ఆమెవద్దకు నీడలా వచ్చాడు.

'నా కిష్టంలేదు.'

రామరాజు ఏమీ అనలేదు. మళ్ళీ నీడలా వెళ్ళి మంచంపై నిరుత్సాహంగా వాలిపోయాడు.

గాయత్రి బుగ్గలమీంచి జారి దుప్పటిని తడిచేసి ఇంకిపోయాయి రెండు కన్నీటిబొట్లు.

రెప్ప బరువుగా వాల్చినా నిద్ర రావటంలేదు. మనస్సు మాత్రం వద్దంటున్నా గతాన్ని గుర్తుచేస్తోంది.

గాయత్రికూడా గతంలోకి వెళ్ళిపోయింది. బరువుగా రెప్పల్ని మూసుకుంటూ...

O O O

ఒక్కగానొక్క కూతురికి ఉద్యోగం చేసేవాణ్ని చెయ్యాలని వీరకంకణం కట్టుకుని చెప్పులరిగేలా తిరిగి ఎలాగయితేనేం ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రామరాజుని అల్లుడుగా చేసుకోవాలనుకున్నాడు గాయత్రి తండ్రి పద్దమూరి సోమరాజుగారు.

ఉద్యోగం మొగుడు దొరికాడని గాయత్రికూడా సంబరపడింది. గడపగడపనూ తాకి మరీ గర్వంగా చెప్పుకుంది.

ఇన్షర్టు చేసుకుని పెళ్ళి పీటలమీద కూర్చున్న రామ


'కథాంజలి' జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !




చర్చలు చాలు!

కొనండి నిజమైన లక్ష్మిని!!

నకలిని తరమండి, ముద్రతో కూడిన ఫోన్ నెంబరునూ గమనించి కొనండి :-

లక్ష్మి వెట్ గ్రైండర్లనే

29వ సంవత్సరాల కోలాహలం!!

తయారించువారు :

తంతి "బెస్ట్ గ్రైండ్"

శ్రీ లక్ష్మి ఇండస్ట్రీస్

56, దేవాంగా హైస్కూల్ రోడ్డు, కొయమత్తూరు-641 002.

మా చే అంగీకరించబడిన డీలర్ల వద్దనే కొనండి.

మా గ్రైండరులో ఏ విధమైన దేవుని పటమూవుండదు

రాజు మర్నాడు కట్నంతోపాటు గాయత్రిని కూడా హైద్రాబాద్ తీసుకువచ్చాడు.

పెళ్ళిపీటలమీద కూర్చోవటానికి ముందు...తరువాత 'చైన్‌స్మోక్' చేయటంతో రామరాజు గురించి వింతగా చెప్పుకున్నారు కోనసీమ ప్రజలు!

హైద్రాబాద్‌లో ఓ పెద్ద మేడముందు కారాగింది.

అంతపెద్ద మేడను చూసి కించిత్ గర్వపడింది కారులోంచి గాయత్రి. తరువాతగానీ తెలియలేదు, అంతపెద్ద మేడలో ఓ బుల్లి గదిమాత్రమే తనుండేదని!

ఆ విషయమే అడిగింది రామరాజుని, 'ఇంత చిన్న గదిలో ఎలా వుండటం!'

'గదిమాత్రం చిన్నదే అయితేనేం! అద్దెమాత్రం రెండు వందలు' సిగరెట్ పొగను గాయత్రి ముఖంమీద రింగులుగా వదులుతూ అన్నాడు రామరాజు.

ముఖంమీద కొస్తున్న పొగను చేతులతో అటూ ఇటూ కొడుతూ బాత్రూం ఎక్కడుంది చుట్టూ పరిశీలిస్తూ అంది.

మేడ వెనక్కువెళితే లెట్రిన్ అండ్ బాత్రూం కంబైండ్‌గానే వుంటాయి.

'నీళ్లు కావాలంటే!'

వీధి చివర కుళాయి కనిపిస్తుంది చూడు అక్కడికి వెళ్ళాలి! క్యూలో నిల్చోవటం కష్టమే అయినా తప్పదు.'

గాయత్రికి పూర్తిగా అర్థమైపోయింది. ఉద్యోగం మెరుపులో కష్టాల పిడుగులు.

కాబోయే భర్త ఉద్యోగం చేస్తున్నాడంటే ఏవేవో ఊహించుకుంది.

'ఏమిటి ఆలోచిస్తున్నావు. ఈ గది నచ్చలేదా' మరో సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు.

'గది నచ్చింది...ఒకేఒక్క గది ఇంత చిన్న గదిలో అన్నీ ఎలా అమర్చుకోవాలో ఆలోచిస్తున్నాను.'

'ఎలా అమర్చుకోవాలో తర్వాత తీరిగ్గా ఆలోచించు! ముందు నేను బయటకువెళ్ళి గంటలో వచ్చేస్తాను త్వరగా రెడీ అవ్వు సిన్మాకి వెళ్దాం!'

'ఇప్పుడే కదా మనం వచ్చింది! అప్పుడే సిన్మాకి ఏమిటండీ?'

'మరేం మాటాడక్కు అంతే!'

రామరాజు విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

గాయత్రి ఆ ఇరుకుగదిలో ఒంటరిగా మిగిలిపోయింది. ఎందుకో భయం అన్పించింది. గది గుమ్మంవరకూ వచ్చి బయటకు చూసింది. పలకరించే ముఖాలేం కన్పించలేదు. అదే తన వూర్లో అయితే నలుగురితో కబుర్లలో పడిపోయి వుండేది.



'కథాంజలి' జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు!

కావలెను

మా చేత తయారింపు అత్యుత్తమమైన జంకాళాలు, బెడ్‌షీట్లకు ఆర్డరు బుక్ చేయుటకు కొత్త కమిషన్ ఏజెంట్లు కావలెను.

మీకు కావలసిన వాటికి మా అధికారం పొందియున్న ఏజెంట్లవద్ద ఆర్డరివ్వండి.

—: Mfrs. :—

Phone : 2261

**Nandakumar Industrials**

P. B. No 57 : : BHAVANI-638 302

రామరాజు వచ్చేటప్పటికి ఫ్రెష్‌గా తయారై వుండి గాయత్రీ వచ్చేటప్పుడు స్కూటర్ తీసుకు వచ్చాడు. అది కొలీగ్ భాస్కర్‌ది.

ఇద్దరూ రామకృష్ణాలో 'గ్యాంగ్ లీడర్' చూశారు. చిరంజీవి ఫైట్స్ ఎంజాయ్‌ని మిగిల్చింది.

ఇంటర్‌వెల్‌లో డ్రింక్స్ తీసుకున్నారు.

తిరిగి యింటి (రూమ్) కి వచ్చేటప్పుడు సుగంధుల్ని విరజిమ్మే మల్లెపూలను తీసుకున్నారు.

ఆ రాత్రంతా మల్లెల వాసనలతో ఆ యిరుకు గది గుభాలించింది. గాయత్రి జీవితంలో అది మరువురాని రాత్రి. ఆ తర్వాత మళ్ళీ ఆ గదిలోకి స్వర్గం తిరిగి చూడలేదు.

మర్నాడు ఉదయం ఏడు గంటలకే రామరాజు ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు.

గాయత్రికి ఏమీ తోచలేదు.

ఆ యిరుకు గదిలోనే కాస్సేపు అటూ-ఇటూ పచార్లు చేసింది. బయట పలకరించే ముఖాల కోసం చూసింది. ప్చ్...లాభం లేదు.

హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది. వెంటనే అమలు జరిపింది. అదే గాయత్రి ప్రత్యేకత.

ఆ యిరుకు గదినే దుప్పట్లతో నాలుగు భాగాలుగా చేసింది.

ఒకటి-హాల్...అతిథుల కోసం!

రెండు-బెడ్‌రూం...రామరాజుకీ తనకూ ప్రత్యేకం!

మూడు-కిచెన్.

నాలుగు-బాత్‌రూం!

స్నానానికికూడా ఎక్కడో మేడ చివరివరకూ వెళ్ళటం! సిగ్గనిపించి తప్పనిసరి పరిస్థితిలో బాత్‌రూమ్‌ని తనకోసం ప్రత్యేకంగా కేటాయించుకుంది.

ఎప్పుడో సాయంత్రం ఐదు గంటలకు వచ్చాడు రామరాజు. వస్తూనే ఆశ్చర్యపోయాడు.

'అసలే చిన్న గది...దీనికి మళ్ళీ తెరలు కట్టడం ఏం బాగుంది?'

'అవసరం అటువంటిదండీ!'

'సర్లే...అయితే ఇక "యిల్లు వెతికే అవసరం లేదన్న మాట!'

రామరాజు మాటలకు గాయత్రి ప్రాణ్పడిపోయింది.

'ప్రస్తుతానికి సర్దుకుపోవటానికి రెండు కర్టెన్లు అడ్డు పెట్టానే కానీ. ఈ యిరుకు గదిలోనే శాశ్వతంగా వుండి


With best compliments from :

**SRI VADIVU TEXTILES.**

—: Manufacturers of :—

ART SILK CARPETS, COTTON CORPETS & FAST COLOUR BEDSHEETS

P. B No. 59, Behind Rayal Theatre

BHAVANI-638 301.

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు చాలా ప్రసిద్ధమైనది.

వాడిన ప్రతి వారూ పదే పదే ఆర్డరిస్తున్నారు.

మా ప్రతినిధిగా వుండేవార్లు మంచి లాభము పొందుతున్నారు.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

పోదామని కాదండీ!'

'సర్దుకుపోవటం సీకలవాటే కదా...ఎలాగో యిక్కడే అడ్జెస్టు అయిపోదాం!'

'మరేం మాట్లాడలేదు గాయత్రి.

రామరాజు బయటకు వెళ్ళి ఎప్పుడో అర్ధరాత్రి దాటాకా తాగిన మైకంలో తూలుతూ వచ్చాడు.

O O O

గాయత్రి స్నానం చేస్తూండగా బయట తలుపు శబ్దం అయింది. త్వరగా స్నానం ముగించి బట్టలు వేసుకొని తలుపు తీసింది.

ఎదురుగా రామరాజు; అతని మిత్రబృందం!

రాత్రి సమయంలో వాళ్ళంతా ఎందుకు వచ్చారో గాయత్రి ఊహించలేక పోయింది.

అప్పటికే అందరూ గడపదాటి లోపలికి వచ్చేసారు.

'ఇదేమిటి గురూ! డ్రామాకి తెరలు కట్టినట్టుగా ఈ కర్టెన్లేమిటి?' గదిలోని కర్టెన్లను తేరిపార చూస్తూ అన్నాడు రామరాజు మిత్రబృందంలో ఒకడు.

రామరాజు మాట్లాడలేదు.

'ఉన్న ఒక్క గదిలోనే స్వర్గాన్ని చూసుకుంటున్నాడు గురుడు.'

'————'

'ఉండేది యిద్దరే అయితే, ఇన్ని తెరలెందుకు... నాన్సెన్స్!'

'ఔనూ...మనం పురాణం విప్పటానికి అగ్గిపెట్టెలాంటి ఈ బుల్లిహాలు ఏం సరిపోతుంది? కనీసం ట్రిబుల్ ఫైవ్ సిగరెట్ పెట్టెంత అయినా ఉంటొద్దూ?'

'నాకో ఆలోచన వచ్చింది.'

'ఏమిటి?'

'ఒక కర్టెన్ తొలగిస్తే...'

తెర చాటుగా వున్న గాయత్రి ఆ మాట వినేసరికి బ్రాన్పడిపోయింది

'ఏంటి మాట్లాడవ్...ఏం చేద్దాం రామరాజూ!'

రామరాజు మాట్లాడలేదు. కానీ మౌనంగా ఓ కర్టెన్ తొలగించాడు.

అప్పుడు హాలుకీ, బెడ్‌రూమ్‌కీ ఉన్న అడ్డు తొలగిపోతుంది. అంతవరకూ బెడ్‌రూమ్‌లో ఉన్న గాయత్రి బెణికిపోతూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

రామరాజు, అతని బృందం చాపమీద కూర్చున్నారు.

పురాణం మొదలుపెట్టారు నెమ్మదిగా. ఇంతవరకూ సస్పెన్సులో వుండిపోయిన వాళ్ళ రాకలోని ఆంతర్యం ఏమిటో యిప్పుడే నెమ్మదిగా తెలుస్తోంది.

పేలబోయే అగ్నిపర్వతంలా గాయత్రి హృదయం స్పందిస్తోంది.

మగాళ్ళంతా బయటకు వెళ్ళి ఎన్ని చెడ్డపనులు చేసినా కన్పించదు. కానీ అదే భాగోతాన్ని యింట్లో మొదలు పెడితే—

R.K.S. KNITTINGS TIRUPUR
Trade Mark
Regd. No. 342215

With best compliments from :
మా ప్రత్యేక తయారీపులు :-

IS : 4964-80

• పాయల్ ఫ్రెంచి
• ISI కూల్ టెక్స్
• ISI పాయల్
• ఫ్రాంక్ ఫిట్ గిట్ డ్యూరబల్
• రన్నర్ ఫ్రేన్సీ

Phone : 22016 Resi. 27169
R. K. S. Knittings
9, Cauvery St., Odakkadu TIRUPUR-638 602.

ఆమె కళ్ళవెంట అశ్రువులు రాలిపడ్డాయి.

ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

'గురూ! కాస్త వాటర్ తెప్పిస్తావా?' పేక కట్ చేస్తూ అన్నాడు మిత్ర బృందంలోని వామనరావు.

'గాయత్రీ! మంచినీళ్ళు తీసుకురా!...' రామరాజు ముఖాన్ని సీరియస్‌గా పెట్టి ముక్కుల్ని ఎత్తుతూ అన్నాడు.

గాయత్రికి గుండె ఆగినంత పనయింది.

తనుండే పల్లెటూర్లో కూడా నలుగురు మగాళ్ళ మధ్యకు ఎప్పుడూ వెళ్ళలేదు.

ఒక్క క్షణం తటపటాయించింది.

మనస్సు సంశయం చెందింది.

'ఇరవై యొక్కటో శతాబ్దంలో అడుగుపెడుతూ కూడా అలా సిగ్గు పడితే ఏం బావుంటుంది 'చెల్లెమ్మ!'...చెల్లెమ్మ అనే పదాన్ని నొక్కి పలుకుతూ అన్నాడు మరో కొలీగ్ భాస్కర్.

ఇక ఆలోచిస్తూ కూర్చోలేదు నీళ్ళు తీసుకువచ్చి. అంతే వేగంతో మళ్ళీ తెరచాటుకి వెళ్ళిపోయింది గాయత్రి.

'ఏమిటే-ఇంకా కొత్త పెళ్ళికూతుర్ననుకుంటున్నావా? సిగ్గు ఒలకబోస్తున్నావ్? ఇలా వచ్చి కూర్చో!' తన చెంతనే చోటు చూపిస్తూ ఆజ్ఞ జారీ చేసాడు రామరాజు.

'గాయత్రిగారు మరీ సిగ్గు పడిపోతున్నారు...వదిలెయ్ గురూ!' మూడో కొలీగ్ సీతారాముడు దమ్ము పీలుస్తూ అన్నాడు.

'గాయత్రికి ఏం చేయాలో తోచలేదు. నల్గురి మధ్యలో కూర్చోవటం ఎంతసిగ్గుచేటు—ఆలోచిస్తూండగానే గొంతు లోంచి ఏడ్పు తన్నుకొచ్చింది. కానీ చేతులతో అడ్డు పెట్టుకుంది రాబోయే ఏడ్పును.

మౌనంగా వచ్చి భయం భయంగా వాళ్ళకు కొద్ది దూరంలో నిల్చుంది గాయత్రి.

'భయం వలదే భార్యామణీ! ఇలా వచ్చి కూర్చో!' రామరాజు చోటు చూపించాడు.

మౌనంగా కూర్చుంది,

రామరాజు మరియు అతని కొలీగ్స్ ఆటలో పూర్తిగా లీనమైపోతూనే గాయత్రిని గుచ్చి గుచ్చి చూస్తున్నారు.

చూపుల ఈటెల్ని గుచ్చుతున్నారు. చిలిపి జోక్స్ వేస్తున్నారు. రాతలకందని బూతుల్ని కొంటెగా మాట్లాడేస్తు




'కథాంజలి' జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !

కావలెను

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు సిల్కు జంకాళాలు, నూలు జంకాళాలు, హాలు జంకాళాలు, డైనింగ్‌హాలు జంకాళాలు ప్రసిద్ధి చెందినవి. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగానున్నవారు మంచి లాభము పొందుచున్నారు.

ఎల్. ఐ. సి. ఏజంటు, రిటైరయిన గవర్నమెంటు పనివారి నుంచి, వారు మంచి లాభం పొందుటకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

—: తయారించువారు :—

Sri Maduraiveeran Traders,

Mfrs of : Art Silk, Cotton Carpets & Bedsheets,

BEHIND ROYAL THEATRE, BHAVANI-638 301.

న్నారు.

తన భార్యపట్ల మిత్రబృందం చాలా నీచంగా మాట్లాతు తున్నా రామరాజు ఏమీ పట్టనట్లుగా వాళ్ళతో శృతి కలుపు తున్నాడు.

గాయత్రి సిగ్గుతో చితికిపోతూ 'భూమి రెండుగా చీలి తనను ఐక్యం చేసుకుంటే ఎంత బావుండును!' అనుకుంది మనస్సులో.

ఎక్కడో దూరంగా తొలుకోడి కూసింది.

హఠాత్తుగా వాళ్ళంతా పేకముక్కల్ని వదిలేసి, హడా వుడిగా బయటకు వెళ్ళిపోయారు-రామరాజుని మిగిల్చి.

అంతవరకూ గొంతులో లావాలా దాక్కున్న ఏడుపు బయటకు వచ్చింది. భోరున ఏడ్చేసింది గాయత్రి.

'ఏం కొంప మునిగిందని రాగం తీస్తున్నావ్? నేనింకా బ్రతికే వున్నాను ' కోప్పడుతూ అన్నాడు రామరాజు.


'మీరు బతికి నన్ను చంపుతున్నారు. అసలే గది చాలక చస్తుంటే మీరంతా ఇక్కడ పేకాట ఆడటం ఏమిటి? వాళ్ళు నన్ను తినేసేలా ఎలా చూసారో తెల్సా...ఛీ! వీళ్లా మీరు ఎంతో గర్వంగా చెప్పుకునే స్నేహితులు' పౌరుషంగా అంది గాయత్రి.

రామరాజు కోపం పట్టలేకపోయాడు. భార్య చెంపమీద కొట్టాడు. 'మా వాళ్ళను ఒక్కమాటంటే ఊరుకోను... నువ్వేమైనా పెద్ద అందగత్తెవనా...నిన్ను తినేసేలా చూడ టానికి! వామనరావుగాడి పెళ్ళాం శ్రీదేవిలా వుంటుంది... సీతారాముడి లవరు దివ్యభారతిలా వుంటుంది. భాస్కర్ గాడి పెళ్ళాం రేవతిలా వుంటుంది. మొన్ననే పోయిం దనుకో!'

'అందగత్తెనని నేనేం చెపకోవ్వటంలేదు. వాళ్ళ ప్రవ ర్తన నాకు నచ్చలేదు. ఇకనుండి ఇక్కడ పేకాట ఆడితే నేనూరుకోను' భోరున విలపిస్తూ అంది గాయత్రి.

'నా యిష్టమే...వద్దనటానికి నువ్వెవరవు... పెళ్ళికి ముందుకూడా పేకాట ఇక్కడే ఆడేవాళ్ళం!'

'అప్పటికి మీరు బ్రహ్మచారి! పెళ్ళికాలేదు కాబట్టి అప్పుడు ఎలాంటి వేషాలు వేసినా అడిగేవాళ్లులేరు. అప్పుడు అంతా మీ ఇష్టం! ఇప్పుడు మీకు భార్యగా నేనుండగా ఈ గదిలో పేకాటలాంటివి ఆడితే సహించలేను '




'ఏమిటి కళ్లు నెత్తికొచ్చినట్లు మాట్లాడుతున్నావ్! ఉంటే ఉండు చస్తేచావు! రోజూ ఇక్కడే రాత్రి, పగలూ తెల్ల వార్లూ పేకాడతాం!'

అంతే...

గాయత్రి విసురుగా మంచంమీద బోర్లా పడిపోయింది.

దిండులో ముఖందాచుకుని కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

ఎంతటి వంచన!

నిజంగా తను మోసపోయిందా!

తన భర్త మేకతోలు కప్పుకున్న క్రూరమృగమా!

దేవుడా...

గాయత్రి యింకా ఏడుస్తూనే వుంది.

మర్నాడు—

'మళ్ళీ అందరూ వచ్చారు.

ఆట మామూలుగానే సాగిపోయింది.

గాయత్రి శరీరాన్ని చూపులతో తినేస్తున్నారు.

ఆ మర్నాడు—

ఆపై మర్నాడు —

అలా రోజూ...రోజూ...

ఇక గాయత్రి సిగ్గును మర్చిపోయింది.

ఏడ్వటానికి గాయత్రి కంటిలో నీళ్ళు నిండుకున్నాయి. ఈటెల చూపుల గాయాల్ని కొంగుతో నిండుగా కప్పుకుం టుంది! శిశిర శాపంతో మాడిపోయే పత్రహరితంలా వాళ్ళ మధ్య జోకర్‌లా ఒంటరిగా మిగిలిపోయింది.

(సశేషం)